

## అడుగంటుతున్న
# భూగర్భ జలాలు

### ఎండల తీవ్రతతో పాతాళంలోకి

- ఆగస్టుతో పోలిస్తే మార్చిలో భారీగా తగ్గిన భూగర్భ జలమట్టాలు
- రాష్ట్రంలో 9.91 మీటర్లకు పడిపోయిన సగటు భూగర్భ జలమట్టం
- భూగర్భ జలవనరుల శాఖ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎండలు గరిష్ఠ స్థాయికి చేరడంతోపాటు నీటి వాడకం భారీగా పెరగడంతో చెరువులు, వాగులు, కుంటలు అడుగంటుతున్నాయి. భారీ జలాశయాల్లో నీటి నిల్వలు ఆవిరైపోతున్నాయి. దీంతో ఈ ప్రభావం భూగర్భ జలాలపై పడుతున్నదని భూగర్భ జలవనరుల నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చివరి దశలో ఉన్న పంటలను రక్షించేందుకు పాతాళగంగను మరింతగా తోడేందుకు రైతులు కొత్త బోర్లను వేస్తుండటంతో పరిస్థితులు ఇంకా దారుణంగా మారుతున్నాయి.

**రాష్ట్ర సగటు నీటిమట్టం 9.91 మీటర్లు**


భూగర్భ జలవనరుల శాఖ నివేదికను పరిశీలిస్తే మార్చి నెలలో రాష్ట్ర సగటు నీటిమట్టం 9.91 మీటర్ల వద్ద నమోదైంది. నిరుడు మార్చిలో సగటు నీటిమట్టం 9.69 మీటర్ల వద్ద ఉంది. ఆ తర్వాత ఆగస్టు చివర్లో కుంభవృష్టి కురవడంతో రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలమట్టం ఆగస్టులో 6.84 మీటర్లు, సెప్టెంబర్‌లో 5.31 మీటర్లు, అక్టోబర్‌లో 5.38 మీటర్లు, నవంబర్‌లో 6.05, డిసెంబర్‌లో 6.72 మీటర్లుకు పెరిగింది. అక్టోబరు నుంచి వర్షాలు సన్నగిల్లడంతో క్రమేపీ నెలనెలా భూగర్భ జలమట్టం పడిపోతూ వచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో అక్కడక్కడ అడపాదడపా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అయినా వాటి కారణంగా భూగర్భ జలాలు పెరగవని నిపుణులు చెబుతున్నారు.

**వేగంగా అడుగంటుతున్న భూగర్భ జలాలు..**

వేసవి తీవ్రతతో రాష్ట్రంలో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. భూపాలపల్లి జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నట్టు భూగర్భ జలవనరుల శాఖ గుర్తించింది. ఫిబ్రవరితో పోల్చితే మార్చిలో ఏకంగా 6.24 మీటర్ల లోతుకు పడిపోయింది. సంగారెడ్డిలో 2.34, సిద్దిపేట జిల్లాలో 2.62, మేడ్చల్ మల్కాజిగిరిలో 2.15, యాదాద్రి భువనగిరిలో 2.11 మీటర్ల లోతుకు చేరుకుంది. ములుగు, మెదక్, నిజామాబా ద్, కామారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, జనగామ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ నీటి తోడకం అధికంగానే ఉన్నట్టు నిపుణులు పేర్కొంటున్నారు.

| నెల | రాష్ట్ర సగటు నీటిమట్టం (మీటర్లలో) |
|---|---|
| 2025 మార్చి | 9.91 |
| ఫిబ్రవరి | 8.68 |
| జనవరి | 7.46 |
| 2024 డిసెంబరు | 6.72 |
| నవంబరు | 6.05 |
| అక్టోబరు | 5.38 |
| సెప్టెంబరు | 5.31 |
| ఆగస్టు | 6.84 |

## మానసిక ఆరోగ్యంలో
# ‘హైదరాబాద్’ లాస్ట్
### మెట్రోపాలిటన్ నగరాల్లో చివరన



- స్మార్ట్‌ఫోన్ వల్లనే దుష్ప్రభావాలు
- మెదడు అభివృద్ధిని దెబ్బ తీస్తున్న ఆహారపు అలవాట్లు
- యువత, పిల్లలపైనే ప్రభావం
- ‘ది మెంటల్ స్టేట్ ఆఫ్ ద వరల్డ్ రిపోర్ట్-2024’ రిపోర్టులో వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): ఐటీ రంగానికి ప్రసిద్ధి గాంచిన హైదరాబాద్ నగర పౌరుల్లో మానసిక ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తున్నట్టు ‘ది మెంటల్ స్టేట్ ఆఫ్ ద వరల్డ్ రిపోర్ట్-2024’ వెల్లడించింది. వాషింగ్టన్ డీసీ కేంద్రంగా పనిచేసే సెపియన్ ల్యాబ్స్ ఈ కథనాన్ని ప్రచురించింది. ఈ నివేదిక ప్రకారం.. మానసిక ఆరోగ్యంలో హైదరాబాద్ చివరి స్థానంలో నిలిచింది. ముఖ్యంగా హైదరాబాద్ యువతలో మానసిక ఆరోగ్య సంక్షోభం ఆందోళనకర స్థితిలో ఉన్నట్టు ఆ అధ్యయనం పేర్కొంది. మానసిక ఆరోగ్య సూచిక (మెంటల్ హెల్త్ కోషెంట్)లో హైదరాబాద్ కేవలం 58.3 పాయింట్లు మాత్రమే సాధించింది. ఇది సగటు స్కోరు 63 కంటే తక్కువగా ఉన్నట్టు పేర్కొంది. ఈ జాబితాలో చివరి నుంచి రెండో స్థానంలో ఢిల్లీ 54.4 పాయింట్లతో నిలిచింది. 18 నుంచి 55 ఏండ్లు పైబడిన 75వేల మందిపై నిర్వహించిన సర్వే ఆధారంగా ఈ రిపోర్టును తయారు చేసినట్టు సంస్థ వెల్లడించింది. బాధల్లోనున్న వారిని, పురోగతి సాధిస్తున్నవారికి మధ్య మెంటల్ హెల్త్ కోషెంట్‌ను వర్గీకరించారు. కాగా ‘స్థిరమైన’, ‘అదుపుచేయగల’ స్థితిలోని వారికన్నా హైదరాబాదీల సగటు దారుణంగా పడిపోతున్నట్టు ఆ నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది.

**స్మార్ట్‌ఫోన్ వినియోగమే ప్రధాన కారణం..**

హైదరాబాద్‌లో నివసించే 32 శాతం మందిలో భావోద్వేగ సంబంధాలు సరిగా లేవని, అధిక ఒత్తిడికి గురవుతూ మానసిక పనితీరులో బలహీనంగా ఉన్నారని ఆ నివేదిక వివరించింది. ఈ ప్రభావం యువత, వయోజనులలో అధికంగా ఉన్నట్టు సెపియన్ ల్యాబ్స్ డైరెక్టర్ శైలెంద్ర స్వామినాథన్ పేర్కొన్నారు. యువతలో మానసిక ఆరోగ్యం సరిగా లేకపోవడానికి అనేక కారణాలున్నట్టు తమ అధ్యయనంలో వెల్లడైందని అన్నారు. సామాజిక సంబంధాలు లేకపోవడం, స్మార్ట్‌ఫోన్ అధికంగా వినియోగించడం వీటి లో ప్రధానమైనవని తెలిపారు. స్మార్ట్‌ఫోన్‌ల అధిక వినియోగం వల్ల చిన్న వయస్సులోనే విచారం, ఆందోళన, దూ కుడు వంటి సమస్యలకు గురవుతున్నారని పేర్కొన్నారు. వీటికి తోడు స్మార్ట్‌ఫోన్‌లను ఎక్కువగా చూడటం వల్ల నిద్రలేమి, ఆహారపు అలవాట్లలో మార్పు మొత్తంగా ఆరోగ్యం పాడవుతున్నట్టు తెలిపారు. ఇక ఆహార పదార్థాల్లో ఉండే పురుగుమందులు, మైక్రోప్లాస్టిక్స్ కూడా మెదడు అభివృద్ధిని దెబ్బతీస్తున్నాయని ఆ నివేదిక వెల్లడించింది. ఈ ప్రభావం పిల్లల్లో అధికంగా ఉన్నట్టు తెలిపింది. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్(యూపీఎఫ్) క్రమంగా తీసుకుంటున్న వారిలో ఈ ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు తెలిపింది. హైదరాబాద్‌లో మానసిక ఆరోగ్యం తీవ్రంగా క్షీణిస్తున్నదని, వెంటనే తగిన నివారణ చర్యలు చేపట్టాలని ఆ అధ్యయనం సూచించింది.

## పంటల బీమాకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి: తుమ్మల

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): వానకాలం, యాసంగి సీజన్లలో రైతులకు ప్రయోజనం కలిగేలా పంటల బీమా పథకానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం పంటల బీమా అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వానకాలం, యాసంగిలో ఏ పంటలకు ఏ విపత్తుల కింద బీమా వర్తింపజేయాలనే అంశంపై సమగ్రంగా చర్చించారు. పంటనష్టం కలిగే అవకాశాన్ని బట్టి రాష్ట్రాన్ని 11 క్లస్టర్లుగా విభజించినట్టు అధికారులు మంత్రికి తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం మార్గదర్శకాల మేరకు వానకాలానికి మొత్తం ప్రీమియంలో రైతువాటా 2 శాతం, యాసంగికి 1.5 శాతం, వాణిజ్య, ఉద్యానపంటలకు 5 శాతం ప్రీమియం ఉంటుందని, మిగిలిన ప్రీమియంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో భరించనున్నట్టు తెలిపారు.